తేది. 01-06-1989న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము

# మానవుడు అమృత పుత్రుడు!

భక్తి అనగా రాగ తాళములతో భజనలు చేయటం కాదు. జ్ఞానమనగా కేవలము ముక్కు మూసుకొని, బట్ట కప్పుకొని మూలను కూర్చోవటం కాదు. జపమనగా కేవలము వేళ్లతో మాలను త్రిప్పుతూ చెవులతో అనేక విషయములు వింటూ కన్నులతో జగత్తును చూడటం కాదు. మనో వాక్కాయ కర్మలచేత భగవంతుని ప్రేమించటయే భక్తి. ఇట్టి పవిత్రమైన భక్తి యొక్క లక్షణాలతో కేవలము మన ప్రాకృతమైన బుద్ధులచేత వీటిని అపవిత్రము గావించుకోవటానికి ప్రయత్నిస్తున్నాము. దేహము అశాశ్వతము. మనస్సు అనిశ్చలము. బుద్ధి కేవలము ప్రాకృత కర్మలనను సరించేది. ఇలాంటి అనిత్యము అశాశ్వతము అసత్యమైన మనో బుద్ధుల కాయము చేత మనము నిత్య సత్యమైన భగవత్తత్త్వాన్ని గుర్తించటము అసాధ్యము. నిత్యసత్యమై నిరుపాధికమై దివ్యత్వము తనయందే ఉంటున్నది. మానవ జన్మ చాలా దుర్లభమైనది. పవిత్రమైనది. కాని ఇట్టి మానవజన్మ ధరించి కూడను మనము ఆత్మాన్వేషణ వదలి అన్నాన్వేషణ కోసం ప్రాకులాడుతున్నాము. కాని ఇట్టి పవిత్రమైన జీవితములో సిరిని మాత్రమే తలంచుచున్నాము కాని హరిని తలంచటం లేదు. మన జీవితమంతా కూడను లక్ష్మీఉపాసన సలుపుతున్నామేగాని లక్ష్మీపతి ఉపాసనకు ఏమాత్రం ప్రాకులాడటం లేదు. లక్ష్మియే మనకు ఆధారమని ప్రధానమని వాదిస్తున్నాముగాని లక్ష్మీపతియైన తత్త్వాన్ని మనము గుర్తించుకోవటం లేదు.

గొప్ప విద్యావంతుడు, జ్ఞాని, తపస్వి, మహాభక్తుడు రావణుడు. అతనికంటె విద్య ఎక్కువ చదివినవారు జగత్తులో ఎవ్వరూ లేరు. 64 విద్యలు అభ్యసించినవాడు రావణుడు. ఎన్ని విద్యలు అభ్యసించి ఏమి ప్రయోజనము. కాని తన ఇంద్రియములకు తాను దాసుడైనాడు, విద్యలనభ్యసించినవాడు విద్యావంతుడు కావచ్చుగాని జ్ఞానముగల జ్ఞాని కాలేదు. జ్ఞానికి

sri sathyasai vachanamrutam

విద్యావంతునకు వ్యత్యాసము ఉంటున్నాది. జ్ఞాని అనగా ఇంద్రియములు అరికట్టుకొన్నవాడు. ఇంద్రియములను స్వేచ్ఛా విహారము సలుపుచు అనేక విధములైన ప్రాకృత విద్యలు అభ్యసించే వాడు విద్యావంతుడు కావచ్చు. కనుక ఇలాంటి విద్యలన్నీ పొట్టకూటి నిమిత్తమై ప్రాకులాడేవి తప్ప నిత్యసత్యమైన ఆత్మ తత్త్వమును గుర్తించేందుకు సాధ్యము కాదు. పవిత్రమైన భక్తి ప్రపత్తులతో నిత్యము ఆరాధనే సలిపే వ్యక్తి గొప్ప గుణశీలుడు. అట్టి గుణములు వర్ణించుటకు ఫణిపతికిగాని, భూపతికిగాని, లేక విద్యాపతికిగాని సాధ్యముకాదు. సర్వ సుగుణములు వర్ధిల్లుచుండిన వాడు ఒక విద్యార్థి అతనే ప్రహ్లాదుడు. ప్రహ్లాద. ప్ర అనగా వికాసముతో ఉండినటు వంటిది. హ్లాద అనగా ఆనందము. ఆహ్లాదము, నిరంతరము విశాలమైన విజృంభించే ఆహ్లాదముతో ఉండేవాడు. అతని భక్తి ప్రపత్తులు ఏ రీతివి.

## ప్రహ్లాదుని భక్తి

నీరు త్రాగుతూ, అన్నము భుజిస్తూ నిద్రిస్తూ నడుస్తూ మాట్లాడుతూ ఆడుతూ పాడుతూ నిరంతరము హరిచింతన లోనే ఉండేవాడు. ఈ ఉత్తమ మార్గము లోపల ప్రయాణము చేసే పుత్రుని చూసి తండ్రి విసుగు చెందాడు. ఈ విధముగా ఈ కుమారుని వదలిపెట్టినప్పుడు కేవలము పిచ్చివాడుగా మారిపోవచ్చు అనే ఉద్దేశ్యముతో మంచి కఠినమైన గురువును పిలిపించి చండా అమార్కులు వారి పేర్లే చండా అమార్కులు అనగా మార్పులేనివారు. ఇలాంటి వారిని పిలిపించి వారికి అప్పచెప్పారు ప్రహ్లాదుని. వీరు తమ జీవనోపాధి నిమిత్తమై హిరణ్యకశిపుని ఆశ్రయించిన వారేగాని జీవిత పరమావధి నిమిత్తమై ఆశ్రయించిన వారు కాదు. వారు బోధించినది యేమిటి? దేవుడంటే హిరణ్య కశిపుడే. దివ్యమైన శక్తి అనగా హిరణ్యకశిపుని శక్తియే దివ్యమైన శక్తి. సర్వజ్ఞుడు ఎవరంటే హిరణ్య కశిపుడే. సర్వవ్యాపకుడు ఎవరంటే హిరణ్యకశిపుడే. ఈ విధమైన హిరణ్యకశిపుని ప్రోద్బలముచేత అతనిని ప్రసన్నుని గావించుకొనే నిమిత్తము ఈ గురువులు ఈ విధమైన బోధలు సలుపుతూ వచ్చారు. కానీ చిన్న పిల్లవానికి హిరణ్యకశిపుడు గురువును పిలిచి ధర్మ అర్థ కామములు ఈ మూడింటిని మాత్రమే నా కుమారునికి బోధించాలి. వీటినే బోధించి ఈ పిల్లవాని హృదయము మార్చాలి అన్నాడు. ఈ విధమైన విరుద్ధమైన బోధలు సల్పటానికి చండామర్కులు పూనుకున్నారు. ఈ టీచర్సులేని సమయాన్ని

srisathyasaivachanamrutam

పురస్కరించుకొని ప్రహ్లాదుడు తోటి బాలురను చేరి ఆడుకోవటానికి పోకుండా వారికి నిత్యసత్యమైన హరి చింతనను వారికి బోధించేవాడు.

పిల్లలకు బోధించేవాడు. మన teachers మనకు సరియైన విద్య తెల్పటం లేదు. లోక సంబంధమైన వాంఛల చేతను, భోగముల చేతను మరింత ఇందులో మనలను ప్రవేశ పెడుతున్నారు. ప్రాపంచిక సంబంధమైన విషయవాసనల లోపల పశుపక్షి మృగాదులు కూడను ప్రవేశపెడుతున్నాయి. జంతూనాం నరజన్మ దుర్లభమ్. దీనిలో వున్న విశిష్టత ఏమిటి? మానవుడై పుట్టి పశుపక్షి మృగాదులవలె ఈ భోగములకై ప్రాకులాడటం సరియైన ధర్మం కాదు. మన జీవితమంతా మంచికే అర్పితము కావాలి. దానికి మించిన ఫలితము మరొకటి లేదు అని ఈ విధంగా బోధిస్తూ వచ్చాడు ప్రహ్లాదుడు. పిల్లలారా! మనము మానవ మాత్రులము. మాధవునకు వారసులము. ఈ వారసత్వానికి మనము ఏమి ప్రయత్నము చేస్తున్నాము. మన సిరి సంపదలన్ని అర్థము కామము కాదు. భక్తియే మన ప్రధానమైన గమ్యము. ధర్మమే మన ప్రధానమైన నడక. ప్రేమనే మన హృదయము యొక్క విశాలత. ఈ మూడింటి తత్త్వము చేత బంధింపబడిన వారము మానవులము. కనుక మనము మనోవాక్కాయములను పవిత్రము గావించి త్రికరణ శుద్ధి లోపల త్రిమూర్తిని దర్శించటమే మనయొక్క కర్తవ్యము. ఈ బోధలంతా ఈ చండామర్కులకు మహా బోధలుగా కనిపించాయి. కాని వారు అర్థకామములు అనేక విధములుగా బోధిస్తూ వచ్చారు.

ఒకానొక సమయము లోపల హిరణ్యకశిపుడు ప్రహ్లాదుని తన దగ్గరకు తీసుకొని రమ్మన్నాడు. ఎంతవరకు చదివాడు ఏమి మార్పు చెందాడు అనే విషయమును గుర్తించటానికి అనేక రకములుగా ప్రయత్నము చేశాడు. చండామర్కులు అనేక రకములుగా గట్టిగా బోధించి నీ తండ్రి అడిగిన దానికి చక్కగా జవాబు నివ్వాలి. హరిని స్మరించకూడదు. భగవంతుని పేరు ఏమాత్రము ఎత్తకూడదు. భగవంతుడు అంటే హిరణ్యకశిపుడు అని మాత్రమే చెప్పాలి. ఈ జగత్తుకు అధిపతి ఎవరంటే హిరణ్య కశిపుని చూపించాలి. వీరు ఇలాంటి బోధలు చేసి చేసి సమీపానికి వచ్చేంతవరకు ఈ బోధలు చేశారు. కానీ సామాన్యమైనవాడు కాదు ప్రహ్లాదుడు. బయటపోయిన తక్షణమే దుర్మార్గులు బోధించే బోధలు వినేవాడు కాదు. చిన్నవాడైనప్పటికి

srisathyasaivachanamrutam

గొప్ప హృదయము కలిగినవాడు ప్రహ్లాదుడు. ఇలాంటి దొడ్డ బుద్ధి కలిగినవాడు కనుకనే ఇలాంటి గొడ్డు బుద్ధికి అవకాశము ఇవ్వలేదు. హిరణ్యకశిపుడు పిలిచాడు. దగ్గరకు పిలిచి తొడపైన కూర్చుండ పెట్టుకొని అనేక రకములుగా ప్రశ్నించాడు. నాయనా నీవు చదివిన చదువులలో ఏదో ఒక్క విషయము చెప్పమన్నాడు.

**చదివించిరి నను గురువులు**
**చదివితి ధర్మార్థ ముఖ్యశాస్త్రంబులు నే**
**చదివినవి కలవు పెక్కులు**
**చదవులలో మర్మమెల్ల చదివితి తండ్రీ!**

మోక్షాన్ని చెప్పలేదు. ఎందుకంటే ఇది సత్యమే. గురువులు బోధించింది అదే ధర్మార్థ కామములు మాత్రమే. అన్నీ అనుభవించుటమే ధర్మము అన్నారు. ఈ ధర్మముచేత అర్థాన్ని సాధించటము ఈ సాధించిన అర్థమును కామములో అనుభవించటము. ఏదో ఒక్కటి శ్లోకముగా చెప్పమన్నాడు. తాను చక్కగా కనులు మూసుకున్నాడు.

**కమలాక్షు నర్చించు కరములు కరములు**
**శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ**
**సురరక్షకుని జూచు చూడ్కులు చూడ్కులు**
**శేషశాయికి మ్రొక్కు శిరము శిరము**
**విష్ణు నాకర్ణించు వీనులు వీనులు**
**మధువైరి దవిలిన మనము మనము**
**భగవంతు వలగొను పదములు పదములు**
**పురుషోత్తముని మీది బుద్ధి బుద్ధి**
**దేవదేవుని చింతించు దినము దినము**
**చక్రహస్తుని ప్రకటించు చదువు చదువు**
**కుంభినీధవు జెప్పెడి గురుడు**
**తండ్రి హరి జేరు మనియెడి తండ్రి తండ్రి!**

srisathyasaivachanamrutam

హరి చేరు నాయనా అని బోధించేవాడు తండ్రిగాని, సిరి సంపాదించు నాయనా అని చెప్పేవాడు తండ్రి కాదు. ఈ విధముగా ఒక్క శ్లోకము లోపలనే గురువులకు, తండ్రులకు, చదువుకు అన్నింటికి కూడా ఒక విధమైన పెద్ద బాంబు వేసినట్టు చేశాడు. ఒరే పిచ్చివాడా! దేవుడు దేవుడు హరి ఎక్కడ ఉన్నాడురా అని మండిపడ్డాడు. హిరణ్య కశిపుడు. వినాశకాలే విపరీతి బుద్ధి ఇంక రాబోతున్నది. ఎక్కడ ఉన్నాడు భగవంతుడు. చిరునవ్వులు నవ్వుతూ ఇందు గలడందు లేదను సందేహము వలదు అన్నాడు. ఎక్కడ చూచినా ఉన్నది ఒక్కడే. నీవు నేను కేవలము భ్రాంతులే. ఉన్నది ఒక్కడే ఇక్కడ. అక్కడ ఎక్కడ చూచినా ఒక్కడే ఉన్నాడు. ఈ తత్త్వాన్ని గుర్తించుకోలేని అంధుడై పోయినావు నీవు. తండ్రి అని ఏమాత్రము గౌరవము లేకుండా చక్కగా వేదాంత ప్రబోధ సలుపుతూ వచ్చాడు. మెడబట్టి అవతలకు నెట్టాడు కుమారుని.

ఈ విధముగా నారదుడు బోధిస్తూ వచ్చాడు ధర్మరాజుకు. ధర్మజునికి చాలా బాధ కలిగింది. పవిత్రమైన గుణవంతుడు, గుణశీలుడు సర్వ సద్గుణములతో మహావ్యక్తిగా ఉండిన ఈ కుమారుని చూచి ఆనందించక ఈ దుర్మార్గుడు అట్టి కుమారుని హింసించుటకు పూనుకోటము సరియైనదా! ఇది చాలా అన్యాయముగా ఉంటున్నదన్నాడు. అప్పుడు నారదుడు చెప్పాడు. సుఖములకు దుఃఖము మంచికి చెడ్డ యిలా రెండు అభావములతో కూడి ఉంటాయి. ఇవి కేవలము ఒక దానికొకటి ప్రతిబింబములు. ఇది లేకుండా అది ఉండటానికి వీలుకాదు. భగవంతునికి కోపముగాని ఇంకే విధమైన ద్వేషముగాని లేదు. అతనికి అనుగ్రహము లేదు ఆగ్రహము లేదు. కేవలము ఒక నిలువుటద్దమువంటివాడు భగవంతుడు. నీ కర్మలే నీకు ఆ reactionగా వస్తున్నాయి. కేవలము ఆ అద్దము నుండి వచ్చే ప్రతిబింబాలు అన్ని నీవే. కనుక నీ ప్రతిబింబము అనే దాన్ని దోషములంతా నీలోనే ఉంటున్నాయి. ఈ రకముగా బోధిస్తూ వచ్చాడు. ఇంతే కాకుండా నారదుడు ప్రహ్లాదుని యొక్క విద్యా ప్రపత్తులు గురించి చక్కగా మహనీయమైన మార్గములో ప్రబోధిస్తూ వచ్చాడు. ఇలాంటి గొప్ప బుద్ధులు రావటానికి కారణము ఏమిటి? కేవలము తల్లిదండ్రులవల్ల కాదు. ఇతను లీలావతి గర్భములో ఉండినప్పుడు నారదుడు అనేక విధములైన వేదాంతములంతా బోధిస్తూ వచ్చాడు. ఆ వేదాంతము యొక్క భావములంతా కూడను, నిండు చూలాలుగా ఉన్నప్పుడు ఆ భావములంతా లోపల ప్రవేశించాయి. అందుకోసమే పూర్వకాలమందు ప్రాచీన సాంప్రదాయము లోపల గర్భవతులైన

srisathyasaivacharamrutam

స్త్రీలకు ఎప్పుడూ మంచి కథలు చెప్పేవారు. మార్కండేయ చరిత్ర ప్రహ్లాద చరిత్ర శ్రీరామ చరిత్ర ఇలాంటి పవిత్రమైన కథలు చెప్పేవారు. ఇవన్నీ పోయి ఈనాటి సంస్కారమంతా చేరటానికి కారణము ఏమిటి? వారికి ఎలాంటి చెడ్డ భావములు రాకుండా నిరంతరము ఆనందముతో ఉల్లాసముతో ఉండే రీతిగా వారము వారము వారికి యేదో పండుగలు చేసేవారు. ఏ దుర్భావములు వారికి అవకాశము లేకుండా ఉండేటట్లుగా నిరంతరము వారికి కళ్యాణ కరమైన కథలు బోధిస్తూ ఉండేవారు. రాక్షస పత్నియైన లీలావతికి కూడను ఈ నారద బోధ వలన ఆ హృదయములో కలిగిన మార్పు కుమారునికి కలిగింది.

**పిల్లల మంచిచెడ్డలకు తల్లిదండ్రులే కారణము**

ఈనాటి పిల్లలు దుర్మార్గముగా ఉండటానికి కారణం ఏమిటి? ఈ దుర్బుద్ధులలో ప్రవేశించుటకు కారణం ఏమిటి? ఈ దురభ్యాసములు అభివృద్ధి పరచుకోవటానికి కారణం ఏమిటి? ఈ దుస్సంగములో చేరటానికి ఉల్లాసపడే మూలకారణము ఏమిటి? అమ్మలు గర్భముతో ఉన్నప్పుడు ఒకటికి రెండు సినిమాలు చూస్తారు. ఆ సినిమాల్లో ఉన్న భావాలు వీళ్లలో ప్రవేశిస్తాయి. కనుక బిడ్డలంతా సినిమా బిడ్డలే పుడుతున్నారు. ఈ దుర్గుణములు, దురాలోచనలు, దుశ్చింతలు ఇవన్నీ సినిమాల వల్లనే వస్తున్నాయి. కనుక వీటికన్నింటికి మూలకారణము తల్లిదండ్రులే. అయ్యో నా కొడుకు నా మాట వినటం లేదు. అయ్యో నేను చెప్పినట్టుగా నడుచుకోవటం లేదే. కారణం ఏమిటి? అమ్మనాన్నలు మంచిగా ఉంటుంటే బిడ్డలు చెడిపోవటానికి అవకాశమే లేదు. ఏ విధమైన సంస్కారము లోపల ప్రవేశిస్తుందో ఆ సంస్కారములకు తగిన ప్రవర్తన ప్రారంభమవుతుంది. కనుక పునాది లోపలనే మార్పు కలుగుతూ రావాలి. మొక్క సొట్టైతే చెట్టు సొట్టగానే వస్తుంది. కనుక ప్రారంభము నుండి భారతీయులయందు అనేక సంస్కారములు ప్రారంభమవుతూ వచ్చాయి. సంస్కారమంటే ఏమిటి? ఏదో ఒక నూతనమైన చట్టము కాదు. నూతనమైన శాసనము కాదు. పుట్టినది పుట్టినట్టుగా ఉండకుండా వాటికి సుగుణములను చేర్చి మనిషికి అనుగుణమైన మార్గములో ప్రవేశ పెట్టటము. దుర్భావములు దూరముచేసి సద్భావములు పోషించటమే సంస్కారము. దుర్గుణములను దూరము చేసి సద్గుణములను పెంచుకోటమే సంస్కారము.

srisathyasaivachanamrutam

ఒక చిన్న ఉదాహరణము. పుట్టిన ప్రతి పదార్థము కూడను అట్లే భుజించటానికిగాని అనుభవించటానికిగాని వీలుకాదు. విలువలేని వస్తువునకు విలువ కలిగించటానికి వీలు కలుగుతుంది. ఒక చిన్న ఉదాహరణము. వడ్లు మనము పండించాము. కానీ పండించిన వడ్లు అట్లే మనము భుజించటానికి ప్రయత్నించము. ఆ పొట్టును పైన తీసి, వాటిని చక్కగా పచనము చేసి తరువాతనే రుచికరమైన పదార్థము చేర్చి భుజిస్తున్నాము. పుట్టినది పుట్టినట్లుగా ఉంటుంటే తక్కువ వెలగా ఉంటుంది. దానిని బియ్యముగా మార్చినప్పుడు వెల అభివృద్ధి అవుతుంది. వడ్లు మూట 50 రూపాయలైతే బియ్యము మూట 500 అవుతుంది. దీనికి సంస్కారము చేత ఎంత విలువ పెరిగింది చూడండి. ఈ విధముగా బంగారుమట్టిలో పుట్టింది. రాతిలో పుట్టింది. ఇది ఒక కల్తీ బంగారముగా ఉంటున్నాది. దానిని పూర్తి కరిగించి అన్ని విధముల పరిశుద్ధము చేసినప్పుడు ఇది అపరంజిగా మారిపోతుంది. ఈ అపరంజిగా మారినప్పుడు విలువ అధికమై పోతుంది. అదేవిధముగా ప్రతి మానవత్వమునకు పశుత్వము, దానవత్వము, మానవత్వము ఈ మూడు చేరి ఉంటున్నాయి. మనము ఈనాడు దానిని పవిత్రము గావించాలంటే పశుత్వము నుండి మానవత్వానికి రావాలి. మానవత్వము నుండి దైవత్వానికి రావాలి.

**చావులేని చదువు చదువవలయు**

కాని ఈనాటి విద్యలన్నీ కూడను మానవత్వము నుండి పశుత్వమునకు మార్చేస్తున్నాయి. కనుక దీనికి కొన్ని విధములైన సంస్కారములు అత్యవసరము. ఆ సంస్కారములు లేకపోవటం చేతనే మానవత్వములో ఎన్ని విద్యలు ఉండినప్పటికిని వారు కేవలము అవివేకులుగా రూపొందుతున్నారు. కాని సంస్కారమనేది పూర్వము నుండి పవిత్రమైనదిగా ఉండినప్పుడు వారికి ఏ సంస్థలయందు చేరినప్పటికి, ఎలాంటి సంఘములో చేరినప్పటికి ఏవిధముగా మార్పు కలుగదు. ఎలాంటి మిత్రులతో కూడను తాను మార్పు చెందదు. తన భావమును మార్చుకోడు. ఇతర భావమును పట్టడు. ఇదే సరైన సంస్కారము. అలాంటి సంస్కారము లేకపోవటం చేతనే ఇక్కడ ఒక విధముగా అక్కడ ఒక విధముగా మార్పుచెంది కేవలము పశువులకంటె హీనమై పోతున్నాడు మానవుడు. కేవలము గ్రంథములు చదివి కంఠస్థము

sri sathyasai vahini.org

చేసి పరీక్షలలో మనము మార్కులు తెచ్చుకోవచ్చును. మార్కులవలన డిగ్రీలు తీసుకోవచ్చును. ఈ డిగ్రీలు తీసుకున్నంత మాత్రమున విద్యావంతులమైపోయినామని గర్వించరాదు. కేవలము అజ్ఞానులమేగాని విజ్ఞానులము కాము. ఇవి ఏనాడు మనము సమాజములో ప్రవేశపెట్టటానికి అధికారము లేదు. కేవలము ఆ డిగ్రీ తీసుకుపోయి పొట్ట పోసుకుంటున్నాము. అదికాదు మన విద్య. నిజమైన విద్య లోపలున్న ఆత్మానందమును మనము అభివృద్ధి గావించుకోవాలి. మన ఆనందమంతా వస్తువులయందో జగత్తునందో ప్రపంచమునందో, సమాజమునందో లేదు. మన పురుషార్థమనేది కూడను సమాజములో లేదు. సర్వ సంస్కారములు మనయందే ఉంటున్నాయి. మానవుడు ఆశించే ఆనందము తనయందే ఉంటున్నది. తన యందున్న ఆనందమును విస్మరించి బయట ఆనందము నిమిత్తమై మనము ప్రాకులాడుతున్నాము. బయట ఆనందము ఎక్కడకూడను కానరాదు. తనయందున్న ఆనందమునే బయట నిరూపించి దానినే తిరిగి ఆనందముగా అనుభవించటానికి ప్రయత్నిస్తున్నాడు. మనము భుజించుచున్నాము. దీనిలో ఆనందము ఉంది అనుకుంటున్నాము. ఇది ఎంత వరకు ఆనందము నిస్తుంది. కడుపు నిండేంతవరకు ఆనందము నిస్తోంది. కడుపునిండితే దానిని అసహ్యముగా నెట్టివేస్తాము దూరముగా ఇవంతా తాత్కాలికమైన ఆనందములు. ఇలాంటి ఆనందము ఆనందము కాదు. నిత్యమైన సత్యమైన ఆనందము ఆత్మానందము. దీనిని సంపాదించుకొని ఈ లౌకికమైన ఆనందమునకు ప్రాకులాడు తప్పు లేదు. దానిని అనుభవించకుండా కేవలము అనిత్యము అశాశ్వతము అయిన ఆనందము కోసం ప్రాకులాడటం ఇది అజ్ఞానము యొక్క లక్షణము.

ఎన్ని డిగ్రీలు మనము పొందుతున్నాము. ఈ డిగ్రీలు తీసుకున్నందువల్ల ఫలితము ఏముంటున్నది. లక్షలు కోట్లు సంపాదించవచ్చు. దీనివల్ల మనకు వచ్చే ఫలితము ఏమిటి? నేను సుఖంగా జీవిస్తాను అంటాడు. ఎంతకాలము జీవిస్తాడు. కాని ఈ జీవితము శాశ్వత సుఖమును ఇస్తుందా? ఈ ధనము పెరుగుతూ ఉంటుంటే భయము మరొకవైపున వెంటాడుతూ వుంటుంది. ఈ భయము ఒక వైపున ప్రయాణము చేస్తుంటే వెంట లోభత్వము వెంటాడుతుంది. ఈ లోభత్వము చేత బంధువులుగాని, మిత్రులుగాని, భార్యగాని ఎవరిని పూర్తి నమ్మరు. వీరినే నమ్మలేనివాడు దైవమును ఏరీతిగా నమ్మగలడు. కట్టకడపటికి తన నమ్మకమునే కోల్పోయి కేవలము దుర్బలుడుగా మారిపోతున్నాడు. ధనం కావలసిందే. ధనము ఉండివలసిందే.

sri sathyasai vachanamrutam

కాని ఏరీతిగా మనము సంపాదించాలి. ఎంతవరకు మనము సంపాదించాలి ఈ యొక్క రెండు నియమాలు కూడా మనము పాటించాలి. ఎంతవరకు అవసరమో అంతవరకే మనము ఉండాలి. ఏ విధమైన మార్గములో ఉపయోగ పెట్టాలో ఆ రీతిగానే ఉపయోగపెట్టాలి.

**ధనమెచ్చిన మదమెచ్చును**
**మదమెచ్చిన దుర్గుణములు మానక హెచ్చున్**
**ధనముడిగిన మదముడుగును**
**మదముడిగిన దుర్గుణంబులు మానును వేమా!**

శంకరాచార్యులు కూడను తన విద్యార్థులైన పదమూడు మందిని తీసుకొని కాశీకి వెళ్ళాడు. ఈ 13 మంది స్నానము చేయటానికి గంగకు వెళుతున్నారు. ఒక చెట్టు క్రింద కూర్చున్నాడు ఒక మహా విద్వాంసుడు. అక్కడకు వెళ్ళి చూచారు. అతని కన్నులు మూసుకున్నాడు. పాణిని వ్యాకరణము చదువుతున్నాడు. విన్నాడు శంకరుడు. నాయనా! ఏమిటి నీవు చదువుతున్నావు అని ప్రశ్నించాడు. గ్రామరు అభ్యసిస్తున్నాను అన్నాడు. ఈ గ్రామరు అభ్యసించటం వలన నీకు లభించే ఫలితము ఏమిటి అన్నాడు. ఈ వ్యాకరణ పండితుడుగా నేను తయారౌతాను అన్నాడు. ఈ వ్యాకరణ పండితుడైన దానివలన నీకు ఏమి ఫలితము అన్నాడు. నేను రాజాస్థానములోకి వెళ్లి గొప్ప కవిగా రూపొందుతాను అన్నాడు. ఈ కవిత్వము నేర్చుకోవటం వలన వచ్చిన ఫలితము ఏమిటి అన్నాడు. రాజు నుండి బహుమతులందుకొని నా కుటుంబముతో సుఖముగ జీవితము గడుపుతానన్నాడు. ఈ సుఖ జీవితము ఎంతకాలము గడుపుతావు అన్నాడు. చచ్చేంత వరకు ఈ సుఖ జీవితాన్ని గడుపుతాను అన్నాడు. ఆ తరువాత ఏమి చేస్తావన్నాడు. తెలీదు అన్నాడు. పిచ్చివాడా! ధనము ఉండినంతవరకు చెరువులో నీరు ఉండినంతవరకు కప్పలు ప్రవేశిస్తాయి. నీకు ధనము ఉండినంత వరకు భార్య బిడ్డలు బంధువులు అందరుకూడను నీ ఇంట్లో తిష్ఠ వేసుకుంటారు. ధనముడిగెనా ఒక్కరు కూడా కన్నెత్తి చూడరు. ధనము అయిపోతే భార్యకూడా గౌరవించదు. పెట్టింది తిని నోరుమూసుకు ఒక గదిలో ఉండు అంటుంది. కొడుకులు కూడ మాట వినరు. నీ పాటికి నీవు పడి ఉండు పని మేము చూసుకుంటామని అంటారు. గౌరవ మర్యాదలు కూడను హీనము చేస్తారు. ఇదా నీకు ధనము వలన కలిగే ఫలితము జ్ఞాన ధనము సంపాదించుకో నాయనా! అంటూ చెప్పాడు

sri sathyasai vahamrutam

**భజ గోవిందం భజ గోవిందం గోవిందం భజ మూఢమతే**
**సంప్రాప్తే సన్నిహితే కాలే నహి నహి రక్షతి డుకృఞ్ కరణే**

ఆనాడు రక్షించదు నిన్ను. ఈ యవ్వనము క్షణకాలములో వదలిపోతుంది. passing clouds మాదిరిపోతుంది. దేహము తెల్లవారి విచ్చిన పూవు సాయంకాలము వాడిపోయినట్టుగా వాడిపోతుంది. నీ సిరి సంపదలు మెరుపు మెరిసినట్టుగా ఒక్క తూరి మించుతుంది. తక్షణమే darkness అందిస్తుంది. కాని నిత్యము మారని సత్యము ఒక్కటుంది. అదే నిజమైన ఆత్మనందము. దానిపైన లక్ష్యమునుంచుకొని లౌకికమైన విద్యలు నీవు ఎన్నైనా నేర్చుకో.

**నిత్యసత్యమును గ్రహించండి**

ఇవన్నీ ప్రాకృతమైన విద్యలే. ఒకటి ప్రవృత్తి రెండవది నివృత్తి. ఈ ప్రవృత్తి ఎప్పుడూ పునరపి జననం పునరపి మరణం. ఈ రెండింటిని అందించేది ప్రవృత్తి. కానీ నివృత్తి పునర్జన్మ నవిద్యతే అనే మార్గాన్ని నిరూపిస్తుంది. పిచ్చివాడా! నీ జీవితము కేవలము బియ్యము పైన husk వంటిది. ఈ husk ఉన్నది ఎక్కడ పెట్టినా పునరపి జననం పునరపి మరణం మొక్కలుగా పుడుతుంటాయి. కనుక ఈ husk తీసివెయ్యి. పొట్టుతీసిన బియ్యముగా మారుతుంది. భుజించవచ్చు ఆనందముగా అనుభవించవచ్చు సంపాదించుకోవచ్చు. కాని దీనికి పుట్టుక లేదు. ఇలాంటి చావు పుట్టుక లేనట్టి సత్యాన్ని గుర్తించటానికి నీ చదువు. కనుకనే ఎప్పుడు తిరిగి చావటం పుట్టటం అయితే ఇంక నేర్చుకునేది ఏమిటి? ఈ జీవితమనేది మీరు చక్కగా విచారిస్తే ఒక డైలీ న్యూస్ పేపరు వంటిది. ఈనాడు చూసిన న్యూస్ పేపరు రేపటి దినము waste paper కావాలి. చదివిన న్యూస్ పేపరునే చదివే మూర్ఖుడు ఎవరైనా ఉంటారా? ఒక్కతూరి మనము చదివామంటే waste paperగా మారిపోతుంది. రెండవ దినము చదవకూడదు. తిరిగి పుట్టటం చావటం ఈ రకంగా ఉంటే ఏమిటిది. ఆ waste paper మేలు కొన్ని పొట్లాలకైనా పనికి వస్తుంది. మన జీవితము దానికి కూడా పనికిరాదు.

గుణము లేని మానవ జీవితము కేవలము ఒక మృగము కంటె పక్షికంటె కూడను, చిన్న పురుగు కంటే హీనమైనది. హంతకుడు పక్షిని కొట్టుకొని చేతిలో పెట్టుకొని తీసుకుపోతుంటే మాంసాహారి దానివెల ఎంత అని తీసుకుంటాడు. చేప చిక్కిందంటే, కలకత్తాలో మీకు బాగా

sri sathyasai vahinamrutam

తెలుసు, ప్రతి వారు చేపలు చేత్తో పట్టుకుపోతుంటారు. దానికి కూడా విలువ ఇచ్చి కొంటారు. కాని చచ్చిన మనిషికి ఎవరైనా విలువ ఇస్తున్నారా? చచ్చిన గోవు చర్మానికి విలువ యిస్తారు. కాని మనిషి చర్మానికి ఎవరైనా విలువ ఇస్తున్నారా? పక్షి ఈకలకు విలువ ఇస్తున్నారు. ఈ బొచ్చుకు ఎవరైనా విలువ ఇస్తున్నారా? ఎక్కడుంది విలువ? పులిగోరు వెల ఇచ్చికొంటున్నారు. నీ గోరు ఎవరు కొంటున్నారు? మృగము చర్మముతో చెప్పులు కుట్టి ధరిస్తున్నారు. నీ చర్మము చెప్పులకు కూడా పనికి రాదు. ఇలాంటి మానవజన్మమును ఇలాంటి హీనమైన స్థితికి తెప్పించుకోవటం! జీవితమునకు సార్థకమైన సేవ లోపల మనము ప్రవేశపెట్టాలి. లక్షలు లక్షలు సంపాదిస్తున్నాము. సిరి కోసమా మనము పుట్టి ఉండేది. కాదు. కాదు హరి కోసము పుట్టాము. ఆత్మ భావమే లేకుండా అన్న భావము ఉంటుంటే వీడు కేవలము ఒక పాపియే. మానవులము అన్న సత్యాన్ని మీరు గుర్తించుకోటానికి ప్రయత్నించండి. పశువుకాదు. పశువువలె తింటూ తిరుగుతూ ఆనందమును అనుభవిస్తుంటే మానవత్వానికి పశుత్వానికి భేదము ఏమున్నాది. ఒక ఇంటికి పది ఇండ్లు కట్టుకోవచ్చు. ఒక డ్రస్సుకు పది డ్రస్సులు సంపాదించుకోవచ్చు. ఒక కారుకి పదికారులు సంపాదించుకోవచ్చు. చచ్చిపోయేటప్పుడు ఒక కారు వస్తుందా? ఒక డ్రస్సు వస్తుందా నీవెంట వచ్చేవి నీ పుణ్యపాపములు రెండే. ఆనాడు ఏడ్చుకుంటూ కూర్చుంటే ప్రయోజనము లేదు కనుక నీవు చదివిన చదువులన్నియు సార్థకము గావించుకునే మార్గములో ప్రవేశపెట్టాలి.

**అజగరుడు**

ఈ ప్రహ్లాదుడు ఒకనాడు సర్వసంగ పరిత్యాగియై ఈ జగత్తు లోపల ఉండే సత్యాన్ని గుర్తించాలని మంత్రులతో ప్రయాణమైపోయాడు. ఈ జడమైన జగత్తునందు చైతన్యమైన తత్త్వము ఎక్కడైనను కనిపిస్తుందా అన్నాడు. కావేరినది సమీపమందు అనేక కొండలమధ్యలో ప్రయాణము చేస్తున్నాడు నడకలో. అక్కడ ఒక్క వ్యక్తి సమాధి నిష్ఠుడై పడిపోయాడు. రూపము సరిగా కనిపించటం లేదు. దుమ్ముతో ధూళితో కప్పబడి ఉన్నాడు. కొండచిలువ కదులుతుందేమోగాని ఈ వ్యక్తి కదలలేదు. ఆ విధముగా స్తంభింపబడిపోయినాడు. ప్రహ్లాదుడు ప్రశ్నించాడు. మహానుభావా! ఎన్ని సుఖములలోనో, ఎన్ని ఆనందముల్లోనో, ఎన్ని సౌఖ్యముల్లోనో

srisathyasaivahini.org

ఉండే మానవునకు ఈ విధముగా నిశ్చింతగా వుండే స్థితి కలుగదు. ఈ త్యాగములోనే నీకింత భోగము కలుగుతున్నాది. నీ పేరేమిటి! అతనే అజగరుడు. అజగరుడు చెప్పాడు. నారాయణా! నా పేరు అజగరుడు. నేను నీవల్లె గొప్ప భోగాలు ఆనందాలు అనుభవించాను. దాంట్లో సత్యమైన సుఖము లేదనుకున్నాను. ఏ విధమైన ఆనందము కలిగినా దానికి విరుద్ధమైన దుఃఖము వెంటాడుతూనే ఉంటుంది. అణుమాత్రము ఆనందము. ఘనమాత్రము దుఃఖము. అనంతమైన దుఃఖాన్ని అనుభవించాను. కాని ఈనాడు నా సర్వస్వము దైవానికి అర్పితము గావించుకున్నాను. ఈనాడు నేను అనుభవించే ఆనందము నేను ఏనాడు అనుభవించలేదు. లేదనే బాధ లేదు. అహం లేదు. వద్దని అయిష్టము లేదు. కావాలని ఆశ లేదు. తన యిష్టము ఎట్లనో అట్లనే జరుగనీయి. ఈ విధమైన స్థితిలో నేను ఉండటం వలన నేను నిరంతరము ఆనందమును అనుభవిస్తున్నాను అన్నాడు. అలాంటి సత్యమును గుర్తించటానికి ప్రయత్నించినవాడు ప్రహ్లాదుడు. జగత్తులో ఈ విధమైన భగవదనుగ్రహము ధనముతో లభించేది కాదు. విద్యలతో వచ్చేది కాదు. అధికారముతో స్వాధీనము చేసుకునేది కాదు. కనుకనే కేవలము సత్కర్మల చేతనే పొందటానికి వీలవుతుంది.

ఎక్కడకు పోయినప్పటికిని నేను మానవుడను అనే భావము మరచి పోకూడదు. నేను పశువు కాదు. నేను మాస్టరు. నేను slave కాదు. ఇతరుల మాటలంతా నమ్మి అందులో ప్రవేశించటానికి నేను బానిసకాదు. నా conscious నేను follow చెయ్యాలి. నా సత్యాన్ని నేను గుర్తించాలి. నా ప్రతిజ్ఞను నేను పాటించాలి. నా వాక్కును నేను నిలబెట్టుకోవాలి. ఈ రకమైన దీక్షలో ఉండినవాడే నిజమైన మానవుడు. నీ యొక్క వాక్కు నీ ఇష్టము వచ్చినట్టు మార్చుకోవటము, నీ మనస్సును మరింత చంచలముగా మార్చుకోవటము మానవత్వము నిర్మూలము చేసుకోవటము, పశుత్వము పెంచుకోవటము, దైవత్వము విస్మరించటము, దానవత్వాన్ని స్వీకరించటము ఇది ఈనాటి చదువు. ఇది కాదు చదువు సంబంధము. ఈ సరైన చదువు చెప్పించే నిమిత్తమై నేను ఈ విద్యాసంస్థలు స్థాపించితిమేగాని ఏదో వ్యాపార రంగమైన దీనితో మేము ప్రారంభించలేదు. సత్యసాయి విద్యాసంస్థలు సత్రాలుగాని, ఏదో వచ్చిపోవటం, వచ్చి నేర్చుకోటం, నేర్చుకొని డిగ్రీలు తీసుకోవటం వెళ్ళిపోవటం కాదు. అందుకోసమే పిల్లల నుండి నయాపైస మేము అందుకోవటం లేదు. మేమే ఇచ్చి వారికి



srisathyasaivachanamrutam

బోధిస్తున్నాము. కనుక మా ఆశయాలకు, మా పవిత్రతకు మా యొక్క mannersకు మా యొక్క behaviour మా disciplineకు మీకు సమ్మతంగా ఉంటే మీరు ఉండవచ్చు. మేము ఎవ్వరిని బలవంతముగా కోరటం లేదు. అట్లు లేని వారిని క్షణముకూడను మేము పెట్టుకోము. కారణమేమంటే మేము ఇలాంటి పిల్లలను తయారుచేసే సంస్థగా మేము మార్చుకోకూడదు. ఇద్దరు పిల్లలు చిక్కినా మాకు చాలు. ఆదర్శప్రాయులుగా ఉండాలి. ఎక్కడకు వెళ్ళినా ఈ సంస్థయొక్క పేరును చక్కగా నిలబెట్టేవారుగా ఉండాలి. తనకు గౌరవము సంస్థకు గౌరవము అందించేవాడుగా ఉంటుండాలి. ఇంతేకాదు తల్లిదండ్రులకు తగిన బుద్ధి నేర్పాలి. తల్లిదండ్రులు నీకు విరుద్ధమైనది బోధిస్తే నాన్నా ఇది సరియైనది కాదు దీంట్లో ఈ సత్యము ఉంది స్వామి బోధించేది మా మంచికోసమేగాని చెడ్డకు కాదు అని వారికి కూడను నేర్పటానికి తగిన సిద్ధులుగా ఉండాలి.

ఒక్క ప్రహ్లాదుడు చిక్కితే కూడా మాకు చాలు. ఆ విధముగా తండ్రికి బోధించినవాడు ప్రహ్లాదుడు. తండ్రీ నీ భావములు చాలా చెడ్డవి. నీ ఆశలు కేవలము కుమారుని నాశనం చేసేందుకు పుట్టినవి. నిజంగా నీవు తండ్రివైతే కుమారుని క్షేమము కోరాలిగాని కుమారుని దుర్మార్గము ఏమాత్రము అభివృద్ధి చేర్చకూడదు. నేను సత్యమైన మార్గమును, సరియైన మార్గమును అనుసరిస్తున్నాను. దీనికంటె పవిత్రమైనది మరొకటి లేదు. ఆ విధమైన ధైర్యముతో వారికి బోధించటానికి తగిన కృషి చెయ్యాలి. అట్లు ఉండినప్పుడే దేశముకూడా బాగుపడుతుంది. అట్లు కాకుండా అటు ఇటు గడియారము పెండ్యులము మాదిరి తిరుగుతే నీవు దేశానికి తగిన వ్యక్తిని కానేరవు. కనుక మనయొక్క వేష భాషలయందుగాని, మన నడతలయందుగాని, మన మాటలయందుగాని, అన్నింటి యందు మనము ఆదర్శవంతమైన విద్యార్థులుగా తయారు కావాలి. కాకపోతే ఈ విద్యలన్ని నిరుపయోగము.

**ప్రహ్లాదుని వలె ఉండండి**

మన భారతదేశములో లేని విద్యలు, భారతదేశములో లేని పవిత్రతలు ఏ దేశములో కూడా లేవు. కేవలము బిడ్డలను beggersగా మార్చి వేస్తున్నారు. తల్లి దండ్రులు ఇష్టము వచ్చినట్లంతా పోవటము, పంపించటము వారు పాడైపోయి వచ్చిన తరువాత కంటిధారలు

sri sathyasaivachanamrutam

కార్చుకుంటూ విచారించటము. కనుక పిల్లలు చేసే ప్రతి పని కూడను మెచ్చుకునే తల్లిదండ్రులు సరియైన వారు కాదు. చెడ్డ పనులను, దుర్మార్గమును, దుశ్చింతలను, దురాలోచనలను పెంచేటువంటి తల్లిదండ్రులు ఎలాంటి తల్లిదండ్రులంటే ధృతరాష్ట్రుని వంటివారు. కుమారుని అభివృద్ధికి అడ్డు తగిలేవారు కేవలము హిరణ్యకశిపుని వంటివారు. ఈనాడు కలియుగము లోపల హిరణ్యకశిపుని వంటి తల్లిదండ్రులు ధృతరాష్ట్రుని వంటివారు తయారౌతున్నారు. కనుక ఈనాటి విద్యార్థులందరు కేవలము నిరుపయోగులుగా మారిపోతున్నారు. ఎక్కడకుపోయినా కూడను విద్యార్థుల యొక్క అలజడులు ఎంత అశాంతిని కలిగిస్తున్నాయి. దీనికి మూలకారణము తల్లిదండ్రులే ధృతరాష్ట్రులు, హిరణ్యకశిపులుగా తయారైపోతున్నారు. ఇంకా కొంతమంది తల్లులు కూడను మంథర కైకేయి మాదిరి అయిపోతున్నారు. ఇలాంటి తల్లిదండ్రులు ఉంటుంటే వారికి బుద్ధులు నేర్పేవారుగా తయారు కావాలి. ఆ విధముగా మార్చినవాడే ప్రహ్లాదుడు. మహా భాగవతమందు అంతకంటె గొప్ప గాథ మరొకటలి లేదు. సప్తమ స్కంధములో ఉండినది ప్రహ్లాద చరిత్ర. ఆ ప్రహ్లాదుని విద్య, ప్రహ్లాదుని నడత, ప్రహ్లాదుని బోధ, ప్రహ్లాదుని పవిత్రత ఎన్ని కష్టములు వచ్చినప్పటికిని ఏమాత్రము దుఃఖించలేదు విచారించలేదు. నాన్నగారు ఏమంటారో ఏమో అమ్మగారు ఏమంటారో ఏమో, నాన్నాగారు బయటకు పంపిస్తారోయేమో ఈ భయముతో ఉండటం మంచిది కాదు. ఏమైనా అవనీ ప్రాణంపోనీ మనము సత్యానికి ప్రాణము ఇవ్వాలి. సత్యానికి మన జీవితము అంకితముగావాలి. అంతేగాని ప్రాణం పోతే పోతుంది. ఎప్పుడో ఒక తూరి ప్రాణం పోవలసిందే. ప్రాణము ఏనాటికైనా పోవలసిందే. కాని సత్యానికి మనము అర్పితము చేద్దాము. ప్రహ్లాదుని ఎన్ని కష్టాలు పెట్టాడు హిరణ్యకశిపుడు. కాని ఒక్కదానికైనా తాను చలించలేదు. హరిని తలుచుకుంటూ ఆనందముగా కాలము గడిపాడు. గురువులు వచ్చి చెప్పారు హిరణ్యకశిపుని దగ్గర

**తన్ను నిశాచరుల్ పొడవ దైత్య కుమారుడు మాటి మాటికో**
**పన్నగశాయి! యోదనుజభంజన! యో జగదీశ! యో మహా**
**పన్న శరణ్యా! యోనిఖిల పావన! యంచు నుతించుగాని తా**
**గన్నుల నీరుతేడు భయ కంప సమేతుడుగాడు భూవరా!**

sri sathyasai vahanamrutam

ఒక్కొక్క తూరి కొడుతున్నప్పుడు అబ్బా అబ్బా అని అనలేదు. హరి హరి అన్నాడు. కంటనీరు తేలేదు. ఆనందముతో చిరునవ్వుతో ఉన్నాడు. భయము లేదు. ఏమాత్రము అతని హృదయము నిండుకు భగవన్నామం నిండి ఉంటున్నాది. నామము ఉన్న చోట భయమునకు అవకాశము లేదు. భయము ఎక్కడ ఉందో అక్కడ తప్పు ఉంది. ఆ దోషము లేని సమయములో భయమునకు అవకాశము లేదు. కనుక నీవు దోషరహితుడుగా ఉండినప్పుడు నీలో ఏమాత్రము భయము రాదు. స్వామీ! మేము బలహీనులము మాకు శక్తి నివ్వండి అన్ని విధములా మంచిగా నడిపించండి అని కోరుకోవటం కూడా పెద్ద బలహీనమే. మనం weak అనే భావమునకు చోటు ఇవ్వకూడదు. మనం కేవలం పులి పిల్లలము కావాలిగాని పిల్లి పిల్లలుగా మనం భావించరాదు. కనుక ఆ విధమైన ధైర్యముతో ముందంజ వేయాలి సమాజములో. అప్పుడే మనము విజయమును సాధించగలము. దీనికి ధైర్యముకావాలి. బలహీనమంటావు. మిగతావన్నీ చేస్తున్నావు దానికి ఆ బలము ఎక్కడ నుండి వస్తుంది. విరుద్ధమైన మార్గములో ధైర్యముగా ప్రవేశిస్తున్నావే నీకీ ధైర్యము ఎక్కడ నుండి వస్తుంది. కాబట్టి ధైర్యము ఉంది కాని దానిని misuse చేస్తున్నావు. misuse చేయటంచేత కొన్ని విధములైన దురభ్యాసములకు గురైపోతున్నారు.

**స్వధర్మము మంచిది**

భగవంతుడు శక్తినిచ్చి చేయించుకోవటానికి తనకేమి అవసరం లేదు. నీ నిమిత్తమై నీవు చేయవలసిందేగాని నా నిమిత్తము కాదు. నీవు మంచివాడవైతే నీకు గొప్ప కీర్తి వస్తుందిగాని నాకోసం కాదు. స్వామి ఏనాడు కూడను తనకోసం ఆశించడు. మీరు మంచిపేరు తెచ్చుకోవాలి. గుణవంతులు కావాలి. మన దేశమునకు మీరు ఆదర్శప్రాయులుగా నిల్చాలి. అదే నేను కోరేదిగాని నాకు ఏమాత్రము ఆశలేదు. స్వామి ఆశయాలకు తగినట్టుగా మిమ్మల్ని తయారు చెయ్యాలనేదే. నాకు ఏ ఆశలు లేవు. మీ మంచియే నా ఆశయము. మీ పవిత్రమైన మార్గమే నా ఆశయము. అంతేగాని నాకు ప్రత్యేకమైన ఆశయములు ఒక్కటీ లేవు. నీవు మానవుడుగా పుట్టావు. నీకు స్వాతంత్ర్యము ఉంటున్నది. నీలో ఆత్మ ఉంటుండాది. నీ ఆత్మ సంబంధమైన మార్గాన్ని నీవు అనుసరించు. అదియే స్వధర్మము. అదే ఆత్మధర్మము. స్వధర్మము మంటే

sri sathyasai vachanamrutam

బ్రాహ్మణధర్మమో, క్షత్రియధర్మమో, వైశ్యధర్మమో శూద్ర ధర్మమో కాదు. స్వధర్మ అదే ఆత్మ ధర్మము. పరధర్మము అనగా ఇతరులను అనుసరించటము పరులను అనుసరించటము వద్దు. నీ యొక్క కాంక్షస్సును నీవు అనుసరించు. అదే స్వధర్మము. ఏ ఒక్కటి నీవు చేయాలనుకున్నప్పటికి నీవు question వేసుకో. మంచిదా చెడ్డదా ఈ కార్యము నేను చేస్తే స్వామి సంతోషిస్తాడా కోప్పడతాడా, ఈ పని చేయటం స్వామికి సంతోషమా కాదా ఈ విధముగా ప్రశ్నించుకుంటే అక్కడే నీకు answer చిక్కుతుంది. స్వామికోరేది అంతాకూడను మంచిపేరు తెచ్చుకోవాలి. మంచినడతతో ఉంటుండాలి. మంచి భావాలు పెంచుకోవాలి. సమాజమునకు మంచినందించాలి. అంతేగాని చెడ్డమార్గములో నీవు ప్రవేశించమని చెడ్డమార్గమే నీయొక్క జీవిత లక్ష్యమని ఏనాడు స్వామి బోధించటం లేదు. ఇలాంటి సత్యాన్ని గుర్తించుకుంటే చాలు. ఏకాంతముగా కూర్చొని స్వామి చెప్పినది మనకు మంచిదా చెడ్డదా అని నీకు నీవే ప్రశ్నించుకో. నీ ఆత్మనే నీకు సరియైన answer ఇస్తుంది. అది మంచిది అని తెలిసినప్పుడు ఇతరుల మంచిని నీవు ఎందుకు అనుసరించాలి. ఇతరులను అనుసరించేవాడు slave. నీ కాన్షస్‌కు నీవు ద్రోహము చేస్తున్నావు. నీవు దైవద్రోహివై పోతున్నావు. బయటవారు ఎవరు నీ మిత్రులు? జేబులో పైసా ఉన్నంతవరకే నీకు మిత్రులు. నీ క్లాసులో కలసి చదివేంతవరకే మిత్రులు. తరువాత ఎవరికి ఎవరు. ఎవరు ఎక్కడ ఉంటారు. ఎవరితో ఎవరికి సంబంధము లేదు. ఏనాటికీ నీ సంబంధము వదలని వాడు దైవము ఒక్కడే. తల్లి దూరముగా వచ్చు. తండ్రి దూరముగా వచ్చు. పుత్రులైనా దూరముగావచ్చు. భార్యయైనా దూరముగావచ్చు. భర్తదూరము గావచ్చు. భగవంతుడు దూరముకాడు. కనుక నిత్యసత్యమైన దివ్యత్వాన్ని దూరము చేసుకొని మిగతావారితో బంధుత్వమనుకుంటే అది నిజమైన బంధుత్వము కానేకాదు. కనుక నీ సత్యాన్ని నీవు అనుసరించు.

## దుస్సంగంలో చేరకండి

భారతీయ సంస్కృతిలో సత్యంవద, ధర్మంచర రెండే రెండు ప్రధానమైన నేత్రాలు. ఏ మతమైనా ఏ కులమైనా, ఏ తెగయైనా విరుద్ధముగా చెప్పటానికి ఎవరికీ అధికారము లేదు. మీరు సంకుచితమైన మార్గములో ప్రయాణము చేయకండి. మానవ కులమనే దానిని

srisathyasaivachanamrutam

పెంచుకోండి. ఈ మానవతా విలువలు పెంచుకోండి. అంతేగాని మన హాస్టలులో, మన కాలేజీలో ఉండినంత వరకు ఒక రీతిగా నాటకం ఆడటం, బయటకు పోతూనే ఇంకొక రీతిగా పోవటము ఈ విధమైనది మీకే చెడ్డ అవుతుంది. కాని నాకేమాత్రము చెడ్డకాదు. ఇంత కాలము ఇక్కడ ఉండి స్వామి కాలమును స్వామి ప్రేమను, స్వామి దయను ఇంత అనుభవించి మీరు కేవలము చెడ్డ పేరును తెచ్చుకోటానికి ప్రయత్నిస్తున్నారే అనేదే నా బాధ. చెడ్డ పేరును తెచ్చుకోకండి. చెడ్డ ప్రవర్తన మీరు చేయకండి. చెడ్డ సంఘాన్ని మీరు చేరకండి. ఈ విధమైన మార్గములో ఉంటే మీరు గొప్పకీర్తి సంపాదించుకున్న వారౌతారు. అదే నిజమైన చదువు. text books చదువుకోవటం గొప్పకాదు. డబ్బు లేకపోయినా మంచిదే ఇంటి ఇంటికిపోయి భిక్షము ఎత్తైనా జీవించవచ్చునుగాని అందులో గౌరవము ఉంటున్నాది. నీవు ఎంత గొప్ప అధికారివైనప్పటికిని ఏదో నీ అధికారము గురించి వచ్చి నమస్కారము అనవచ్చు. బయట తట్టుపోయి ఇట్లాంటివారు అట్లాంటివారు అని చెప్పుతుంటారు. నీకు ఇచ్చే నమస్కారము దుడ్డు కోసము ఇస్తున్నారుగాని మానవత్వం కోసం ఇవ్వటం లేదు. మానవతా విలువలు లేనివాడు మనిషి కాదు. గొప్ప కోటీశ్వరుడు కావచ్చు. ప్రైమినిష్టరు కావచ్చు పెద్ద ప్రెసిడెంటుగా వచ్చు. ఒక్కతూరి foot ball పైకి ఎగిరి క్రింద పడినట్టుగా పడి పోతుంది.

సమాజములో మనము గౌరవము సంపాదించుకోవాలి. సమాజములో మంచిపేరు తెచ్చుకోవాలి. ఎంత పీడించి పీడించి డబ్బు సంపాదించుకొని గొప్పవాడమనుకున్నామంటే అది గొప్పతనమే కాదు హీనస్థితి. దాంట్లో ఏమాత్రము అర్థం లేదు. మంచి పేరు తెచ్చుకోండి. ఎక్కడ పోయినా చదువు మానినా చదువుకుంటూ ఉండినా బయటకు పోతూనే ఇష్టము వచ్చినట్లుగా ప్రవర్తించకూడదు. దురభ్యాసాల్లో ప్రవేశించకూడదు. పోతూనే త్రాగటాలు సిగరెట్లు బీడీలు ఎన్ని విధములుగానో ఉంటుంది బయట students. వీరు స్టూడెంట్సు కాదు. కాదు. స్టుపిడ్సు. అలాంటి stupids ఇక్కడ ఉండటానికి వీలులేదు. ఎవరైనాసరే టీచర్సు అయినాసరే వార్డెను అయినాసరే ఇంకెవరైనా సరే క్లాసు లోపల సరియైన క్రమశిక్షణతో మెలగకుండాపోతే తక్షణమే వాని సామానుతో బాటు బయటకు పంపించాలి. ప్రార్థనా సమయానికి సకాలంలో అందరూ వచ్చి చేరాలి. భోజన సమయం లోపల అందరూ ఒక్కతూరి కూడాలి. సమిష్టి భజన, సమిష్టి పూజ అందుకోసమనే బుద్ధుడు చెప్పాడు సమ్యక్ దృష్టి,

srisathyasai vachanamrutam

సమ్యక్ వాక్కు, సమ్యక్ శ్రవణం, సమ్యక్ కర్మ అదే సహజమైన మార్గమన్నారు. అంతేగాని ఒక్కొక్కరు ఒక్కొక్కతూరి పోకూడదు. స్కూలుకు అందరూ ఒక్కతూరి పోవాలి. అందరూ ఒక్కతూరి భోజనశాలలో ప్రవేశించాలి. విద్యాలయమని ఒక్కటి మాత్రమే కాదు. నాలుగు ఆలయాలు ఉంటున్నాయి. ఒకటి విద్యాలయము, రెండవది వైద్యాలయము, మూడవది భోజనాలయము నాలుగవది ఏమిటి తెలుసునా దేవాలయము. దేవాలయము బయటకాదు ఉండేది. తనలో ఉంటున్నది. ఆ దేవాలయమును మాత్రము వదలకుండా ఈ ఆలయము లోపల మాత్రము సకాలములో సక్రమమైన రీతిలో discipline అనుసరించి నడుచుకోవాలి. discipline లేక ఏమి ప్రయోజనం.

**వినయ విధేయతలతో ఉండండి**

తండ్రి అంటే గౌరవము లేదు. తండ్రికొడుకు ఫ్రెండ్సు మాదిరి ఉంటుంటారు. ఆ తండ్రికి సిగ్గు లేదు కొడుక్కి సిగ్గు లేదు. ఈనాడు ఆధునిక విద్యలోపల పెద్ద freedom అని అనుకుంటున్నారు. freedom కాదు. deaf and dumb మూర్ఖత్వము. కొడుకు తండ్రిని చూస్తే గౌరవముగా అన్ని విధములా అణిగి మణిగి ఉండాలి. అలాంటిది లేని కొడుకును shoot చేసినా తప్పు లేదు. అలాంటి కొడుకులు ఉండకూడదు. అలాంటి కొడుకులను తయారు చేయకూడదు తండ్రులు. అప్పుడే నిజమైన భారతదేశము నిజమైన భారతదేశముగా నిలుస్తుంది. ప్రాచీన సాంప్రదాయమునకు తగినట్లుగా నిలుస్తుంది. ఆ నీతి, నిజాయితీలు రెండు లేకపోతే ఏమి ప్రయోజనము. ఛీ! ఛీ! అది ఏమాత్రము పనికిరాదు. మన institue పిల్లలంతా గౌరవాన్ని నిలుపుకోవాలి.

ఇంటికి పోతూనే తల్లిదండ్రులకు వినయ విధేయతలు చూపించాలి. చూపించటమే కాదు మెలగాలి ఆ రీతిగా ఈనాడు నీ తల్లిదండ్రులకు తగిన గౌరవమిస్తే రేపు నీ బిడ్డలు నీకు గౌరవమిస్తారు. కన్న తల్లిదండ్రులకే గౌరవమివ్వలేని బిడ్డలు వీరు ఎందుకు పుట్టారు. కనుక వీరు బిడ్డలుగారు. బిడ్డలను ఎట్లా పెంచాలని తెలుసుకొని బిడ్డలను కనండి లేకపోతే ఎందుకు పందికి కూడా పది పందులు పుడుతున్నాయి. ఒక్కతూరి ఏమి ప్రయోజనం. అవే ఇంకా మేలు తల్లిని అనుసరించి పోతుంటాయి. ఈనాటి మానవుడు తల్లిని అనుసరించడు తండ్రిని



srisathyasaivachanamrutam

అనుసరించదు. పందికంటె హీనమై పోతున్నారు. అలాంటి చెడ్డనేమాత్రము తెచ్చుకోకండి. సత్యసాయి ఇన్స్టిట్యూట్లో చదివే పిల్లలందరు కూడను సరైన నీతి నిజాయితీలతో మెలగాలి. మన behaviour సరిగా ఉంటుండాలి. మన manners సరిగా ఉంటుండాలి. discipline సరిగా ఉంటుండాలి. ఈ మూడు లేక man కాదు. the proper study of mankind is man. ఎంతఉంటే అంత చాలు మనకు. గౌరవంగా బ్రతకాలి. మన గౌరవము ధనముతో వచ్చేది కాదు. గుణముతో వచ్చేది. గుణపోషణ చెయ్యాలి. కాని ధనపోషణ కాదు. గుణమును పెంచుకోవటానికి తగిన ప్రయత్నము చెయ్యాలని నేను ఆశిస్తున్నాను. దీనికి తగిన ప్రోత్సాహఉత్సాహములు గురువులు కూడను వారు ఆచరించి వారు కూడ తగిన ప్రబోధలు చేయటానికి కంకణము కట్టుకోవాలి.

నిజముగా మీరు గ్రంథములో ఉన్న పాఠములు చెప్పటము కాదు గొప్పతనము. తెల్లవారి మొదలు రాత్రి వరకు వీరి నడత ఎట్లా ఉంది, వీరి వేషాలు ఎట్లా ఉన్నాయి, వీరు ఏవిధమైన study చేస్తున్నారు దానిపైనే మీరు చక్కని concentration చేస్తే అదే నిజమైన teaching. ఏ విధంగా మాట్లాడుతున్నారు, ఏ విధంగా నడుస్తున్నారు, ఏ విధంగా చదువుతున్నారు, ఏ విధంగా తింటున్నారు ఇవన్నీ కూడను teachers watch చెయ్యాలి. డైనింగ్ హాల్లో పిల్లలు భోజనము చేస్తుంటే కుక్కపిల్లలు తింటునట్టు తింటున్నారు. ఆ తినేది కూడను విద్యనే. అది కూడను చక్కగా నేర్పించాలి. క్రిందపడకుండా అన్నం వేస్తుకాకుండా చక్కగా నమిలి తినాలని వీరికి బోధించాలి. మనుష్యులు భుజించినట్టు భుజించాలి. కుక్క భుజించినట్టు భుజించకూడదు. పరిశుద్ధముగా ఉంటుండాలి. మనము భోజనము చేసిన చోటుకూడా పరిశుద్ధముగా ఉండాలి.

మన bath rooms కూడను చక్కగా పరిశుద్ధముగా ఉండాలి. మనము బహిర్ముఖముగా ఎంత శుభ్రముగా ఉంటామో లోపలకూడా అంత శుభ్రముగా వుండాలి. మన లోపల సరియైన శుద్ధము లేకపోవటం వల్లనే బయటకూడా అశుద్ధిగా ఉంటున్నది. Reflection of inner being. పైతట్టు బాగా చక్కగా డ్రస్సులు వేస్తాం. లోపల స్నానాలు కూడా చేయం. చాలా తప్పు దీనివల్ల dirty thought అంతా develop అవుతాయి. ఎందుకంటే లోపల

srisathyasaivachanamrutam

dirtyగా ఉంటున్నది. ఆరోగ్యమైన దేహములో ఆరోగ్యమైన గుణములు పుడుతూ ఉంటాయి. మనము పండ్లు తోముకోవటంకూడా పరిశుద్ధముగా ఉంటుండాలి. చక్కగా పరిశుద్ధముగా ఉంటే యింకా పది తూర్లు వానితో మాట్లాడ బుద్ధి అవుతుంది. కానీ వారు బ్రష్ చేయకుండా పోతే వాడు ఇట్లా వస్తే మనము ఇట్లా పోవాలి. శుభ్రత ఆరోగ్యమునకు గుర్తు. కనుకనే ప్రతి ఒక్క విషయములో పరిశుద్ధముగా ఉంటుండాలి. అప్పుడే చిత్తశుద్ధి కలుగుతుంది. ఎక్కడ చూసినా గలేజుగా ఉంటుంటే చిత్తము ఏమాత్రము గలేజు కాకుండా ఉంటుందా. తలకు కూడా తగిన సంస్కారము చేసుకోవాలి. oil పెట్టాలి. student గా ఉన్నాం ఆ age లో ఎట్లాఉండాలో ఆ విధంగా గౌరవంగా ఉండాలి. అంతేగాని అంతా ఇమిటేషన్ వారితో వీరితో చూచుకొని పోతుంటే మనము కుక్కల మాదిరి తయారైపోతాము. మనము dogs కాకూడదు. Gods కావాలి. చక్కగా చదవండి. మంచిమార్కులు తెచ్చుకోండి. ప్రాపంచిక విద్యలు చదవాలి. అప్పుడే నిజమైన విద్యార్థులమవుతాము. విద్యకు వినయము ప్రధానమైనది. ఈ వినయమే లేకపోతే ఇది విద్యకు సంబంధించినది కాదు. మనము ఎవరైనా పెద్దలతో మాట్లాడేటప్పుడు చాలా వినయముగా మాట్లాడాలి. పెద్దలు ఎవరైనా ఉంటే వారి ముందు నడచేటప్పుడు చాలా వినయంగా నడవాలి.

**గురుకుల పద్ధతి మన విద్యా విధానము**

పూర్వము గురుకులములో ఏ విధంగా తయారయ్యేవారు. ఆ గురుకుల పద్ధతి రావాలనే ఉద్దేశ్యముతోనే నేను ఇక్కడ విద్యాసంస్థలు ప్రారంభించాము. ఆనాడు భిక్షమెత్తి అనుభవించేవారు. ఇక్కడ ఏమీ లేదు. కావలసినన్ని సుఖములు కావలసినన్ని అనుకూలములు అన్నీ ఉంటున్నాయి. పిల్లలు మంచివారే. కానీ నా ఉద్దేశ్యములో ఏమంటే ఇంటి దగ్గర తల్లిదండ్రులు పాడుచేసి పెడుతున్నారు. warden కాని teachers కాని ఎల్లవేళల వాని యొక్క behaviour వానియొక్క మార్కులుగాని నడతలుగాని ఇవన్నీ తల్లిదండ్రులకు ఎప్పటికప్పుడు తెలుపుతూ ఉండండి. వారు ఏమైనా సరిలేకపోతే తల్లిదండ్రులకు కూడా వ్రాయవలసిందే మనము. మీకు బుద్ధిరాదా. పిల్లల్ని చంపుకుంటున్నారు. ఇది సరియైనది కాదు. మీరు సరియైన మార్గములో పెట్టాలని వారికి కూడా బోధించాలి. ప్రేమ ప్రేమ అంటే

sri sathyasai vahanamrutam

ధృతరాష్ట్రుని ప్రేమకాదు మీకు ఉండవలసినది. దశరథుని ప్రేమకావాలి. కుమారుని విడచి ప్రాణమే విడచినాడు పాపం. అలాంటి ఆదర్శవంతమైన పిల్లలుగా ఉండాలి. అంతే నేను కోరేది.

ప్రతి విషయమునందు సరైన నడత, మాట, ప్రవర్తన ఉండాలి. ముందు వేరు వెనుక వేరుగా ఉండకండి. ఇక్కడ ఉండినా ఇంటి దగ్గర ఉండినా ఒకే నడతగా ఉంటుండాలి. అటు ఒకరకంగా ఇటు ఒకరకంగా ఉంటుంటే ఇది డ్రామా డాన్సు మాదిరి అయిపోతుంది. స్టేజి మీద ఒకటి యాక్టు చేయవలసి వచ్చినప్పుడు ఒక వేషం వేయవలసి వస్తుంది. స్టేజి వెనుకపోతూనే ఇంకొకటి యాక్టు చేయవలసి వస్తుంది. కాబట్టి యాక్టరుగా ఉండకు. జీవితమే ఒక యాక్టింగ్ కాని మానవ actగానే మనము ఉండాలి. మానవుడుగా మనము ప్రవర్తించాలి. ఏ వేషాలు నీవు నేర్చుకోకు. ఈ విధంగా ఉంటుండి సరైన కీర్తి సంపాదించుకొని Instituteకి కూడా కీర్తి సంపాదించండి.

## కృతఘ్నత కన్నా పాపము లేదు

విద్యార్థులారా! మీరు ముఖ్యముగా నేర్చుకోవలసినది. ఏ బ్రహ్మహత్యాపాతకమునకైనా దోషపరిహారము ఉంటుండాది. గోహత్యా పాతకమునకైనా పరిహారము ఉంటున్నాది. స్త్రీ హత్యాపాతకమునకైనా పరిహారము ఉంటున్నాది. వేదరహితమైన కర్మలకు కూడా పరిహారము ఉంటున్నాది. కాని కృతజ్ఞత లేకుండా కృతఘ్నుడైపోతే దీనికి పరిహారము లేదు. gratitude లేకపోయిన పరవాలేదు. కాని కృతఘ్నుడు కాకూడదు. అది మాత్రం ఉండకూడదు. కృతఘ్నుడుగా ఉంటుంటే నీవు చచ్చేంతవరకు ఈ పాపం తప్పింది కాదు. ఇది మహా పాతకం. నిజమైన కృతజ్ఞతను మనం పెంచుకోవాలి.

ఇంతకాలము స్వామి ఒక నయాపైసా తీసుకోకుండా free education. ఇస్తున్నారు. ఎక్కడైనా ప్రపంచములో ఉంటున్నదా. లైబ్రరీఫీజు, లేబొరేటరీఫీజు, మెడికల్‌ఫీజు, ట్యూషన్‌ఫీజు ఏదీ లేదే. ఎందుకోసము మిమ్మల్ని చదివిస్తున్నాము. కొంతమందైనా మంచిపిల్లలు తయారౌతారు దేశము బాగుపడుతుందని. ఈనాడు బయట ప్రదేశమునకు పోతే LKGలో చేరటానికి ఐదువేల రూపాయలు కట్టాలి. అక్కడ డబ్బు తీసుకుని చెప్పే దానిలోనే మీరు

srisathyasaivachanamrutam

చక్కగా ఉంటున్నారు. నేను ఇంత freeగా మా బిడ్డలుగా చూసుకొని చెప్తే కూడను gratitude లేకుండా పోతున్నారు. అది లేనివాడు మనిషేకాదు. రాక్షసులకంటే హీనమై పోతాడు. అలాంటి రాక్షసులుగా తయారు కాకండి. మంచి మానవులుగా తయారుకండి. ఆదర్శ మానవులుగా తయారుకండి. అదే మేము కోరేటువంటిది. దీన్ని మాత్రము మనస్సులో నిరంతరము స్మరిస్తూ రావాలి. నేను కృతజ్ఞుడుగా ఉన్నానా లేదా అని క్షణక్షణము యోచించుకుంటూ రావాలి. విద్యావంతులనే అహంకారమునకు మీరు చోటు ఇవ్వ వద్దండి. 'O' grade వచ్చిందని ఏ మాత్రం అహంకారమును అవకాశం ఇవ్వకండి. ఈ 'O' grade, 'A' grade నేను చూడటం లేదు. రానీ రాకపోనీ నీ మనస్సు పరిశుద్ధముగా ఉంటే అదే పెద్ద grade. ఆ గ్రేడు లేక ఈ గ్రేడు వచ్చి ఏమి లాభము. గ్రేడు నేను ఎప్పుడూ ఆశించను. మంచి గుణవంతుడు కావాలి. అమృతపుత్రుడు అని పేరు తెచ్చుకోవాలి. ఆ పేరు తెచ్చుకోవటానికి తగిన ప్రయత్నం చేయండి.

**(తేది. 01-06-1989న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam